# కీలక వ్యాపారాలపై పెన్నార్ దృష్టి

ABN , First Publish Date - 2023-12-12T02:09:24+05:30 IST

ఇంజనీరింగ్, తయారీ సేవల రంగాల్లో అంతర్జాతీయంగా ప్రధాన కంపెనీల్లో ఒకటిగా ఆవిర్భవించే దిశగా పెన్నార్ ఇండస్ట్రీస్ అడుగులు వేస్తోంది...



- ఏటా రూ.100 కోట్ల పెట్టుబడులు
- కొనుగోళ్లకు రూ.120 కోట్లు

- కొత్త చైర్మన్ రామకృష్ణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంజనీరింగ్, తయారీ సేవల రంగాల్లో అంతర్జాతీయంగా ప్రధాన కంపెనీల్లో ఒకటిగా ఆవిర్భవించే దిశగా పెన్నార్ ఇండస్ట్రీస్ అడుగులు వేస్తోంది. ఇందుకు కీలక వ్యాపారాలపై దృష్టి కేంద్రీకరించి అప్రాధాన్య వ్యాపారాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించింది. ఈ మార్పు ఇప్పటికే ప్రారంభమైందని కంపెనీ కొత్త చైర్మన్‌గా నియమితులైన ఆర్‌వీఎస్ రామకృష్ణ తెలిపారు. చైర్మన్ పదవిని చేపట్టిన సందర్భంగా కంపెనీ భవిష్యత్ ప్రణాళికలపై విలేకరుల రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. కంపెనీ దాదాపు 16 వ్యాపారాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా.. అంతర్జాతీయంగా మంచి మార్కెట్ అవకాశాలు, అధిక మార్జిన్లు ఉన్న అయిదు వ్యాపారాలపై దృష్టి కేంద్రీకరించనుంది. ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్స్ (పీఈబీ), ట్యూబ్స్, హైడ్రాలిక్స్, ఇంజనీరింగ్ సర్వీసులు, ప్రాసెస్ అండ్ హీటింగ్ ఎక్విప్‌మెంట్ వ్యాపారాల్లోని అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోవాలని భావిస్తున్నట్లు రామకృష్ణ చెప్పారు. సోలార్ మాడ్యూల్ మ్యానుఫ్యాక్చరింగ్, రిటైల్, డిశాలినేషన్ వంటి వ్యాపారాల నుంచి బయటకు రానుంది. ప్రస్తుతం కంపెనీ ఆదాయంలో 50 శాతం వాటా ప్రాధాన్య వ్యాపారాల నుంచే లభిస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లుగా కంపెనీ ఆకర్షణీయ వృద్ధిని నమోదు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో లాభం 45 శాతం పెరిగి రూ.30.46 కోట్ల నుంచి రూ.44.17 కోట్లకు చేరిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పెన్నార్ ఆదాయం రూ.2,894 కోట్లుంది.

అంతర్జాతీయంగా విస్తరణ: 2028 నాటికి భారత్, యూఎస్‌లో పీఈబీ మార్కెట్‌లో దాదాపు రూ.43,000 కోట్ల అవకాశాలున్నాయి. హైడ్రాలిక్స్ అడ్రెసబుల్ మార్కెట్ విలువ రూ.40,000 కోట్లు. కంపెనీ అంతర్జాతీయంగా కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా 2016లో పెన్నార్ గ్లోబల్ ఐఎన్‌సీని ఏర్పాటు చేశాం. 2021లో ఎసెంట్ పేరుతో పీఈబీ తయారీ కార్యకలాపాలను చేపట్టాం. గత సాధారణ సంవత్సరంలో 8 కోట్ల డాలర్ల ఆదాయం ఆర్జించాం. జర్మనీలో ఇంజనీరింగ్ సర్వీసెస్‌ను ప్రారంభించాం. ఏరోస్పేస్ కంపెనీని కొనుగోలు చేయడం ద్వారా ఫ్రాన్స్‌లో మాన్యుఫ్యాక్చరింగ్ కార్యకలాపాలను ప్రారంభించామని పెన్నార్ ఇండస్ట్రీస్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అదిత్య రావు తెలిపారు. అడ్వాన్స్‌డ్ హైడ్రాలిక్స్, ఇన్నోవేటివ్ కస్టమ్-డిజైన్డ్ బిల్డింగ్ సిస్టమ్స్, సమగ్ర ఇంజనీరింగ్ సేవలను కంపెనీ వృద్ధి చోదకాలుగా గుర్తించామని చెప్పారు. అమెరికా భారత్‌లలో కార్యకలాపాల విస్తరణ, బలోపేతం కావడం పెన్నార్ ఇండస్ట్రీస్ ప్రధాన వ్యూహంగా ఉంది. ప్రస్తుతం పెన్నార్ ఇండస్ట్రీస్ మొత్తం ఆదాయంలో 60 దేశీయంగా, 35 శాతం ఉత్తర అమెరికా, 5 యూరప్ నుంచి లభిస్తోంది.

కొనుగోళ్లపై దృష్టి.. : కంపెనీ ప్రధాన వ్యాపారాల్లో ఇమిడిపోయే కంపెనీలను కొనుగోలు చేయడానికి పెన్నార్ యోచిస్తోంది. ఖాతాదారులు, అడ్వాన్స్డ్ టెక్నాలజీలు కలిగిన కంపెనీలను కొనుగోలు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వనుంది. రూ.120 కోట్లు కంపెనీల కొనుగోలుకు ప్రత్యేకంగా ఉన్నాయని ఆదిత్య రావు తెలిపారు. ఇవి కాక ప్రతి ఏడాది కోర్ వ్యాపారాల్లో ఏడాదికి రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. ఏరోస్పేస్ రంగంలో అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్యకలాపాలను చేపట్టనున్నామన్నారు. కంపెనీలో 3,000 మంది ప్రత్యక్షంగా పని చేస్తున్న ఉద్యోగులు, నిపుణులున్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాసెస్, స్ట్రక్చరల్ ఇంజనీర్లను కంపెనీ నియమించుకోనుంది.